క్లుప్తంగా

ఎమ్మెల్యేకు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: మంథని అభివృద్ధిపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి కొరవడిందని జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. మంథనిలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయాన్ని పట్టణ శివారులో నిర్మించేందుకు ప్రయత్నాలు చేయడం విడ్డూరమని.. అందరికీ అందుబాటులో ఉండేలా పట్టణంలోనే నిర్మించాలన్నారు. గతంలో ఎంపీ నిధులతో స్థానిక ఫ్రెండ్స్ క్లబ్‌లో అసంపూర్తిగా ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ అభివృద్ధికి వచ్చిన రూ.38 కోట్ల నిధులు పీయూఎఫ్ఐడీ బ్యాంకు ద్వారా రుణం సమకూరాయని, వాటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యేకు రాజకీయాలపై ఉన్న ప్రేమ, ప్రజలపై లేదని, మంథని నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, నాయకులు తగరం శంకర్‌లాల్, మాచిడి రాజుగౌడ్, సెగ్గెం రాజేశ్, బత్తుల సత్యనారాయణ, గర్రెపల్లి సత్యం, కాయిత సమ్మయ్య ఉన్నారు.

ఆహార పదార్థాలను శుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమ

మంథని: వర్షాకాల సీజన్‌లో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఆహార పదార్థాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ సూచించారు. మున్సిపల్ పరిధిలోని హోటల్స్, స్వీట్, ఫాస్ట్‌ఫుడ్, తోపుడు బండ్ల వ్యాపారులతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. పరిశుభ్రత పాటించాలని, దోమలు, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మహిళా శక్తి పథకం, శ్రీనిధి సమస్యలపై మహిళలతో సమావేశమయ్యారు. దరఖాస్తు చేసుకున్న మహిళలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. తదనంతరం తొలి ఏకాదశి సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి, వీకే రవి పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయం ఆకస్మిక సందర్శన



వంటగదిని పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: కుందనపల్లి గ్రామ శివారులోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని మంగళవారం ఎంపీడీవో ఎంఏ.అలీం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నేరుగా కిచెన్‌లోకి వెళ్లిన ఎంపీడీవో వంటగదిని పరిశీలించారు. కిచెన్‌లో నిల్వ ఉన్న నిత్యావసరాలను పరిశీలించారు. ప్రాంగణంలో నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాపించే అవకాశం ఉంటుందని, ఎప్పటికప్పుడు వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేజీబీవీ ప్రాంగణంతో పాటు బయట పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి క్లోరినేషన్ చేయాలని కార్యదర్శి కృష్ణను ఆదేశించారు. దీంతో సిబ్బందితో స్వచ్ఛ చర్యలు చేపట్టారు. ఎంపీవో అబ్దుల్ వాజిద్ ఉన్నారు.

పొలంబాట పట్టిన విద్యార్థులు



నాటు వేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: పట్టణంలోని విద్యార్థులు పొలంబాట పట్టారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులకు రైతుల పరిస్థితులు, రైతులు పండించే ఆహార పంటలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రియ తెలిపారు. విద్యార్థులు పొలంలో దిగి నాటు వేశారు.

బెంబేలెత్తిస్తున్న వానరసైన్యం

- ఎల్కలపల్లి గేట్‌లో కోతుల వీరంగం
- ఇళ్లపై రేకులు ధ్వంసం, ఇంట్లో సామగ్రి చిందరవందర చేస్తున్న వైనం
- అడవికి తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని వినతి



ఎల్కలపల్లి గేట్‌లో రోడ్డుపై కోతుల గుంపు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం కొత్తగేట్, పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్ గ్రామాల్లో కోతులు ఇళ్లపై చేరి రేకులను, ఇళ్ల పైకప్పులను ధ్వంసం చేస్తున్నాయి. వందల సంఖ్యలో కోతులు ఉండడంతో గుంపులు గుంపులుగా ప్రజల మధ్యలో సంచరిస్తూ ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనన్న భయాందోళన కలిగిస్తున్నాయి. డోర్ తీసి ఉంటే ఇంట్లోకి చొరబడి ఇంట్లోని సామగ్రి చిందరవందర చేస్తున్నాయి. కిరాణ షాపుల్లో చొరబడి తిను బండారాల డబ్బాలు ఎత్తుకెళ్తున్నాయి. ఇంటిపై ఏర్పాటు చేసిన నీటి ట్యాంకును ధ్వంసం చేస్తున్నాయని, వాన చేష్టలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

అడవి నుంచి గ్రామాల బాట..

అడవులను ధ్వంసం చేయడంతో ఆహారం కోసం కోతులు గ్రామాలు, పట్టణాల వైపు చేరుతున్నాయి. ఆహారం ఎక్కువ దొరికే ప్రాంతాల్లో వానరాలు వందల సంఖ్యలో నివాసం ఉంటూ ఆహారం కోసం ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఎల్కలపల్లిగేట్‌లో కోతుల దాడిలో స్థానికులు గాయపడిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి గ్రామంలోని కోతులను తరలించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రేకుల షెడ్డు కూల్చాయి



రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లి గేట్‌లో వందల సంఖ్యలో కోతులు ఇండ్ల పైకి చేరి ఇంటి ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును ధ్వంసం చేశాయి. ఇంట్లో చొరబడి ఇంట్లోని వంట పాత్రలను సైతం ఎత్తుకెళ్తున్నాయి. అధికారులు స్పందించి కోతులను తరలించేలా చర్యలు చేపట్టాలి.

– సుంకనపల్లి లత, ఎల్కలపల్లిగేట్

దాడి చేస్తున్నాయి



గ్రామంలో ఒంటరిగా వెళ్లే వాళ్లను కోతులు భయపెడుతున్నాయి. ఇంట్లోకి చొరబడి వస్తువులను చిందర వందర చేస్తున్నాయి. ఆహార పదార్థాల కోసం ఇంట్లో చొరబడి ఇంట్లో ఉన్న వారిపై సైతం దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– బండి సాయికుమార్, ఎల్కలపల్లిగేట్

అధికారులు స్పందించాలి



గ్రామంలో కోతులు ఎక్కువగా ఉన్నాయి. గ్రామంలోని పెంకుటిల్లు, రేకుల షెడ్లను కోతులు ధ్వంసం చేస్తున్నాయి. కిరాణా షాపుల్లో ఉన్న తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. అటవీశాఖ అధికారులు దృష్టిసారించి కోతులను అడవిలోకి తరలించేలా చర్యలు తీసుకోవాలి.

– దబ్బేట భానుచందర్, ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్

ఉత్పత్తికి అంతరాయం కలుగకుండా చూడాలి



మాట్లాడుతున్న జీఎం ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓసీపీ–1, 2 ఉపరితల గనుల ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, మట్టి వెలికితీత లక్ష్యాలపై చర్చించారు. నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి, నిర్దేశించిన బొగ్గు రవాణా చేయడానికి అనుగుణంగా తమవంతు కృషి చేయాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి సమష్టిగా కృషి చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించుకోవడానికి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఏరియా సేఫ్టీ అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ఫారెస్ట్, సీహెచ్‌పీ డీజీఎంలు బానోత్ కర్ణ, కాశీ విశ్వేశ్వర్‌రావు, ఏరియా సర్వే అధికారి డి.జనార్దన్‌రెడ్డి, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ ఎం.నాగరాజు, మేనేజర్లు ఉదయ్ హరిజన్, కె.వి.రామరావు పాల్గొన్నారు.

కార్మికుడి మృతికి యాజమాన్యం బాధ్యత వహించాలి

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 సింగరేణి కార్మికుడు ఆంజనేయులు మృతికి యాజమాన్యం బాధ్యత వహించాలని టీబీజీకేఎస్ ఆర్జీ–3 డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అనారోగ్య కారణాలతో నాన్ ఆపరేషన్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులుకు 7నెలల సర్వీస్ మాత్రమే ఉందని, నాన్ ఆపరేషన్ సెక్షన్ నుంచి ఆపరేషన్ సెక్షన్‌కు బదిలీ చేయడంతో తీవ్ర ఆందోళన చెంది గుండెపోటుకు గురై మరణించాడని ఆరోపించారు. ఓసీపీ–2లో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని కార్మికుల హక్కులను కాపాడాల్సిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యం తొత్తుగా మారాయాని విమర్శించారు. కార్మికుడి మరణానికి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు బాధ్యత వహించాలన్నారు. గతంలో నాన్ ఆపరేషన్ సెక్షన్ నుంచి తీసివేసిన కార్మికులను మరలా విధులు నిర్వహించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తుల మేళా

గోదావరిఖని: 2024–25 ఆర్థిక సంవత్సరంలో సేవా వొకేషనల్ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్జీ–2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. వృత్తి విద్యా కోర్సులైన టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల కోసం ఆసక్తి, అర్హత గల మహిళల కోసం ఈనెల 20న ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు మేళా నిర్వహిస్తామని తెలిపారు. అదేరోజు ఫ్యాకల్టీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 1న ఈ కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ముత్యాలగౌడ్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామ మాజీ సర్పంచ్ బుర్ర ముత్యాలగౌడ్ మంగళవారం ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. మురికి కాలువల్లో, రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన ముళ్ల పొదలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలని కోరారు. డ్రైనేజీలు సరిగా లేక వర్షం నీరు ఇళ్లలోకి వస్తోందన్నారు. గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీఎంకు విన్నవించారు. కోరారు. ఏఐటీయూసీ నాయకుడు కందుకూరి రాజారత్నం ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ జానీ నర్సింహులు

గోదావరిఖని: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ జానీ నర్సింహులు హెచ్చరించారు. గోదావరిఖని ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్‌తో కలిసి స్థానిక బస్టాండ్, చౌరస్తా ఏరియా ఆటో డ్రైవర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి పరిశీలించారు. రెగ్యులర్ కానిస్టేబుల్‌తో పాటు మరొక కానిస్టేబుల్‌ను అదనంగా నియమించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు సరైన పద్ధతిలో తమ ఆటోలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. అలాగే యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. పట్టణ ప్రజలు కూడా ప్రధాన రోడ్డుపై బైక్‌లు నిలిపితే ఫోటోలు తీసి ఫైన్ వేస్తామని పేర్కొన్నారు.

బదిలీ కానిస్టేబుళ్లకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్ రాజేశం, కానిస్టేబుల్ రాజమౌళి, లక్ష్మణ్, సంపత్‌కుమార్, అశోక్‌ను ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఆంక్షలు విధించకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతీ రైతుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రుణమాఫీకి ఆంక్షలు విధించి రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరికీ రుణమాఫీ వర్తింప చేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పోరాటాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మగాని అనిల్, తాటికొండ శంకర్, గుర్రం లక్ష్మిమల్లు, పోలుదాసరి సాయికుమార్, నీలం శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్, తోట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రమోద్‌కుమార్

కమాన్‌పూర్: మండల పరిధిలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలను మంగళవారం ఏవో బండి ప్రమోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ చూపాలి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండేలా గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. పెద్దపల్లి మండలం కాపుపల్లిలో మంగళవారం ఎంపీవో సుదర్శన్, ఎంఈవో సురేంద్రకుమార్‌తో కలిసి ఎంపీడీవో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎలిగేడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా అన్నారు. మండలంలోని ముప్పిరితోటలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 56 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. శానిటేషన్‌పై గ్రామంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీవో అనిల్‌రెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్త వహించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లిలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని కాలనీవాసులకు సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ తిరుపతి, ఏఎన్ఎం విమల, అంగన్‌వాడీ కార్యకర్త స్వప్న పాల్గొన్నారు.

ఇళ్లలో నీటి నిల్వ ఉంచుకోరాదు

సుల్తానాబాద్: నల్లాల ద్వారా వచ్చిన నీటిని నిల్వను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. పట్టణంలో మంగళవారం ఇంటింటా ఉన్న నీటి నిల్వలను అందులో ఉన్న లార్వాలను గుర్తించి సిబ్బందితో నీటిని పారబోయించారు. ఆయన వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

వసతిగృహాల ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచితేనే సీజనల్ వ్యాధులు దరిచేరవని సైకాలజిస్టు డాక్టర్ మధుకర్‌రెడ్డి, హెచ్ఈవో మధుసూదన్ అన్నారు. పెద్దపల్లిలోని సమీకృత బాలికల వసతిగృహంలో మంగళవారం ఎస్సీ, బీసీ హాస్టళ్లలోని సిబ్బందికి సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎస్సీ సంక్షేమశాఖ అధికారి నాగలేశ్వర్, బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవో విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండారంలో వైద్యశిబిరం

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో కమాన్‌పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సూపర్‌వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

'వర్గీకరణ బిల్లుపై ఒత్తిడి తేవాలి'

పాలకుర్తి: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి కోండ్ర శంకర్‌మాదిగ కోరారు. జీడీనగర్ పంచాయతీ పరిధి బీసీకాలనీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో శంకర్ మాట్లాడారు. 19న భువనగిరిలో జరిగే ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశానికి అందరూ హాజరు కావాలన్నారు. అనంతరం పాలకుర్తి ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడిపల్లి సంజీవ్, ఉపాధ్యక్షుడిగా నెరువట్ల అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎల్క టూరి లక్ష్మణ్, కార్యదర్శిగా సలిగంటి అరవింద్, ప్రచార కార్యదర్శిగా రేణికుంట్ల సతీశ్‌ను ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కిట్ల పంపిణీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రిస్కూల్ చిన్నారులకు మంగళవారం మండల పరిషత్ ప్రత్యేకాధికారి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్ చేతుల మీదుగా కిట్లు అందజేశారు. చిన్నారులకు సులభంగా విద్యాబోధన చేసే విధానాలతో కూడిన బొమ్మల పటాలు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ పెండ్యాల విమల, కార్యదర్శి శంకర్ ఉన్నారు.

గ్రామస్తుల శ్రమదానం

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధి కేకేనగర్ గ్రామ ప్రజలు మంగళవారం శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. గ్రామ మాజీ సర్పంచ్ శిలారపు లక్ష్మణ్, బుర్ర ముత్యాలగౌడ్, గ్రామ నాయకులు, ప్రజలు అజ్మీర, శ్రీను, గొడుగు మల్లేశ్, బూడిద గట్టయ్య, ఓదెలు, రాయలింగు, తిరుపతి, స్వరూప, రమేశ్, బుచ్చయ్య, కొమురయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా సీత్లాభవాని పండుగ వేడుకలు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలో మంగళవారం బంజారుల సంప్రదాయ సీత్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తండావాసులు సమీపంలోని అటవీప్రాంతానికి వనభోజనాలకు వెళ్లారు. ఈ సందర్భంగా సీత్లా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. తండా పెద్దమనిషి బదావత్ ఖేల్‌దాస్, సారయ్య, ఇస్లావత్ షకలాల్, బాండ్యా, రాజు, భూక్య శ్రీనివాస్, బదావత్ మంథియా, బదావత్ అంజినాయక్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ముత్తారం: ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 80మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎరువులు సక్రమంగా రైతులకు అందేలా చూడాలని ఆ సంఘం చైర్మన్ అల్లాడి యాదగిరిరావును కోరారు. మండలంలోని ఓడెడ్, ముత్తారం, అడవిశ్రీరాంపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించారు. హెడ్ కానిస్టేబుల్ మధునయ్య, పీఏసీఎస్ సీఈవో ప్రసాద్ ఉన్నారు.

ముళ్లపొదల తొలగింపు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్‌లో మంగళవారం ప్రత్యేక అధికారి శైలజరాణి ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించారు.

అంగన్‌వాడీ బాట అవగాహన ర్యాలీ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాపూర్‌లో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం–2 నేతృత్వంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణపూర్(కొత్తపేట)లో మంగళవారం అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి(52) తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

బదిలీ ఏఎస్సైకి సన్మానం



ఏఎస్సైని సన్మానిస్తున్న ఎస్సై శ్రీధర్

జూలపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు రామగుండం బదిలీ కాగా మంగళవారం స్థానిక ఠాణాలో ఎస్సై శ్రీధర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, అమరగాని సాయి ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి, పొత్కపల్లి గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా సుల్తానాబాద్, జమ్మికుంట వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న భూపాల్

రామగిరి: రాష్ట్రంలో నూతన బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని 18న నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. ఏపీఏ గనిలో మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏపీఏ పిట్ సెక్రటరీ దేవర రవికుమార్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సదానందం, నాయకులు వెంకటేశ్వర్లు, అహ్మద్, పాషా, వేణు, తిరుపతి, మనోహర్, పిట్ కమిటీ సభ్యులు రంజిత్, హబీబ్ పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలకు ముస్తాబు



ముస్తాబైన వీర్లపల్లి దర్గా



పీరీల ఊరేగింపు

- 105ఏళ్లుగా వీర్లపల్లిలో పీరీల కొలువు

ఫెర్టిలైజర్‌సిటీ: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో 1938 మార్చి12న మొహర్రం రోజు ఫైవ్ ఇన్‌క్లయిన్ భూగర్భ గనిలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 43మంది కార్మికులు మృతి చెందారు. సింగరేణి చరిత్రలోనే పెద్ద ప్రమాద సంఘటన ఇది. సింగరేణి యాజమాన్యం నాటి నుంచి జాతీయ సెలవు దినాలతో పాటు మొహర్రం రోజున సెలవు దినాన్ని ప్రకటించింది.

105ఏళ్ల చరిత్ర కలిగిన వీర్లపల్లి పీరీలు..

రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో 105ఏళ్లుగా పీరీల పండుగ నిర్వహిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఈ పీరీలను, దర్గాను కొనసాగిస్తున్నారు. ఏడుతరాలుగా వీరు వంశపారంపర్యంగా వస్తున్న సంప్రదాయాన్ని ఆచరిస్తున్నారు. సర్వర్‌పాషా, సున్‌పాషా, కదర్‌పాషా, వకీల్‌పాషా, హుస్సేన్‌పాషా, నియమతుల్లా, రహమత్ పాషా వంశీకులు చాంద్‌పాషా, కలీంఉల్లా హుస్సేన్, జుబేర్‌పాషాలు పీరీలను కొలుస్తున్నారు. వీర్లపల్లి, లక్ష్మీపురం, అల్లూరు, న్యూమారేడుపాక, పెంచికల్‌పేట గ్రామాల ప్రజలు ఇక్కడికి వస్తారు.